
తిమ్మాపురంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ విజయ్‌భాస్కర్


ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు


కైలాసపట్నం పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్యే అభ్యర్థి జోగులు


ఉపమాకలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయుల మధ్య ఘర్షణ


గొలుగొండ : రాత్రి 7గంటలకు పుత్తడి గైరంపేటలో పోలింగ్ స్టేషన్ వద్ద రద్దీ


పోలింగ్ గడువు ముగిసిన తర్వాత కూడా క్యూలో ఉన్న ఓటర్లు

పోటెత్తిన ఓటు


యరకన్నపాలెంలో మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతి

- నియోజకవర్గంలో ప్రశాంతంగా పోలింగ్
- ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు
- పలు చోట్ల గంట ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్
- రాత్రి వరకు కొనసాగిన పోలింగ్

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు క్యూలో బారులు తీరారు. మండుటెండను లెక్క చేయక వృద్ధులు, వికలాంగులు సైతం పోలింగ్ బూత్‌లను సందరించి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొన్ని చోట్ల రాత్రి 8 గంటలు దాటే వరకూ పోలింగ్ కొనసాగింది. రాత్రి 10 గంటల సమయానికి తుది సమాచారం అందేనాటికి నర్సీపట్నం 64.93 శాతం, పాయకరావుపేట 67.3 శాతం పోలింగ్ నమోదైంది.


తామరంలో ఉదయం 8 గంటలకే బారులు తీరిన ఓటర్లు


పెదబొడ్డేపల్లి పోలింగ్ స్టేషన్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ మురళీకృష్ణ


ఉపమాకలో బూత్ వద్ద ఓటు కోసం క్యూలో నిలుచున్న పురుషులు, మహిళలు


దేవవరంలో ఓటేయడానికి క్యూలో నిల్చున్న ఓటర్లు


కైలాసపట్నంలో పోలింగ్ స్టేషన్ వద్ద బారులు తీరన ఓటర్లు


ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఎమ్మెల్యే గణేష్ కుమారులు ఆదర్స్ అవినాష్


పాల్తేరులో ఓటు వేయడానికి వస్తున్న వృద్ధురాలు

నర్సీపట్నం : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో పోలింగ్ సందర్బంగా చెదురు ముదురు సంఘటనలు మినహా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైనప్పటికీ కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎనిమిది గంటల వరకు పోలింగ్ ప్రారంభం కాలేదు. మరికొన్ని చోట్ల చిన్నపాటి సాంకేతిక లోపాలు కారణంగా ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. మున్సిపాలిటీలో పలు కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియా మందకోడిగా సాగడంతో ఓటర్లకు నిరీక్షణ తప్పలేదు. ఓటు వేసేందుకు ఓటర్లు ఆయా బూత్‌ల వద్ద బారులు తీరాల్సి వచ్చింది. పోలింగ్ సమయం 6 గంటలకు ముగిసినప్పటికీ ఓటర్లు క్యూలో ఉండడంతో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఉదయం అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద స్థానిక యువకులు వృద్ధులను చేతులతో. ట్రైసైకిళ్లపై తీసుకువచ్చి ఓటు వేయించారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక వైద్య శిబిరంతో పాటు తాగునీటి సదుపాయం కలిప్పించారు. ఉదయం 9.30 గంటలకు 60.68 శాతం , 11 గంటలకు 21.32 శాతం, మధ్యాహ్నం ఒంటి గంటకు 40.60.8 శాతం, సాయంత్రం 3 గంటలకు 58.12 శాతం, 5 గంటలకు 64.20 శాతం. మొత్తం మీద నర్సీపట్నం నియోజకవర్గంలో ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది.

ఆర్సీఎం స్కూల్ పోలింగ్ బూత్‌లో ఓటు వేసిన గణేష్

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ సోమవారం ఉదయం 8 గంటలకు పెదబొడ్డేపల్లి ఆర్సీఎం స్కూల్ పోలింగ్ బూత్‌లో కుటుంబ సభ్యులతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులతో పట్టణంలో గచ్చపువీధి బాలిక హైస్కూల్ బూత్‌లో ఓటు వేశారు.

రాత్రి వరకూ కొనసాగిన పోలింగ్

గొలుగొండ : సార్వత్రిక ఎన్నికలు ప్రశాతంగా జరిగాయి. మండలంలో 52 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం తమ ఓటు హక్కును ప్రజలు వినియోగించుకున్నారు. చిన్న చిన్న సంఘటను మినహా ఎటువంటి అవాసంచనీయ సంఘటనలు జరగలేదు. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఎన్నడూ లేని విదంగా ఈ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియెగించుకోవడం జరిగింది. ఎఎల్‌పురం, చీడిగుమ్మల, గొలుగొండ, పాకలపాడు ప్రాంతాల్లో పోలీసులు భారీగా బందోబస్తు నిర్వహించారు. రాత్రి 7 గంటలైనా కసిమి, పుత్తడిగైరంపేట కేంద్రాల్లో పోలింగ్ నిర్వహణ జరుగుతుంది. రాత్రి 7గంటకు 75శాతం వరకు వచ్చింది. మరింత ఓటింగ్ శాతం పెరుగుతుందని అధికారులు తెలుపుతున్నారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గొలుగొండ, కృష్ణదేవిపేట ఎస్ఐలు కృష్ణారావు, ఉపేంద్ర బందోబస్తు నిర్వహించారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగింది. మండలంలోని 31 పంచాయతీల పరిధిలోని 59 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఎన్నికలు జరిగాయి. మొత్తం 46,406 మంది ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. పి.తూటిపాలలో కొద్ది సేపు ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. శెట్టిపాలెం, తామరం, బూరుగుపాలెం, మాకవరపాలెంలో ఉదయం నుంచి ఓటర్లు బారులు తీరారు. పి.పి.అగ్రహారంలో ఉదయం నుంచి పోలింగ్ మందకొడిగా సాగుతుండటంతో రాత్రి 8 గంటలు దాటుతున్నా కేంద్రంలో సుమారు 200 మంది ఓటర్లు పోటెత్తారు. భీమబోయినపాలెం, తాడపాల, శెట్టిపాలెంలో రాత్రి 8 గంటలు దాటే వరకు పోలింగ్ కొనసాగింది. పెద్దిపాలెంలో రాత్రి 9:30 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది.


తిమ్మాపురం పోలింగ్ బూత్ వద్ద ఓటేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు

భారీ మెజార్టీతో గెలుస్తా..

ఎస్.రాయవరం : మరళా రాష్ట్రంలో అవినీతి రహిత పరిపాలన కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. తిమ్మాపురంలో ఆయన తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తమకు ఓటు బ్యాంకుగా మారాయని ఓటర్లు స్వచ్ఛందంగా తరలివచ్చి ఫ్యాను గుర్తుకు ఓటు వేస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళా ఓటర్లు అత్యంత ఉత్సాహం చూపించి ఫ్యాను గుర్తుపై ఓటు వేశారని, తాము పాయకరావుపేట నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కూటమిలో ఎన్ని పార్టీల కలిసినా ప్రజలు విశ్వసించలేదన్నారు.

మొరాయించిన ఈవీఎంలు

నక్కపల్లి : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం చిన్నపాటి ఘర్షణలు మినహా ప్రశాంతంగా జరిగింది. నిబంధనల ప్రకారం ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. చాలా చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ గంటనుంచి రెండు గంటల ఆలస్యంగా ప్రారంభమైంది. సాయంత్రం ఆరుగంటలతో పోలింగ్ ముగించాల్సి ఉండగా ఉదయం ఈవీఎంలలో ఏర్పడిన సాంకేతిక లోపాలు కారణంగా ఆలస్యంగా ప్రారంభమవడంతో క్యూలో వేచి ఉన్న ఓటర్లంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ సమయాన్ని పొడిగించారు. ఉదయం ఏడు గంటల నుంచి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. మండుటెండను సయితం లెక్క చేయకుండా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వేచి ఉండడం విశేషం. నియోజకవర్గంలో మొత్తం నాలుగు మండలాల్లో 2.50 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. 292 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గతంలో పోలింగ్ ప్రారంభమైన గంటకే పోలింగ్ 20 శాతం పూర్తవ్వగా ఈ దఫా మాత్రం ఈవీఎంల సమస్యల కారణంగా ఉదయం11 గంటలకు కనీసం 7 శాతం కూడా పోల్ కాలేదు. నక్కపల్లిలో 207, 208 నెంబరు పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు మొరాయించాయి సమస్యలను పరిష్కరించిన అనంతరం పోలింగ్ ప్రారంభమైంది.

ఓపీఎంపై వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆగ్రహం

చినదొడ్డిగల్లు పోలింగ్‌బూత్‌లో వృద్ధులు, వికలాంగులు, కళ్లు సరిగా కనిపించని వారి ఓటును వారు చెప్పిన విధంగా కాకుండా సైకిల్‌కు వేస్తున్న ఓపీఎం బాలాజీరావు వైఖరి పట్ల వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు తదితర వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ ఉద్యోగి టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఆందోళనకు దిగడంతో కొద్ది సేపు పోలింగ్ నిలిచిపోయింది. ఈ విషయాన్ని ఆర్వో దృష్టికి తీసుకెళ్లడంతో సదరు ఉద్యోగిని వేరే విధులు అప్పగించారు. దీంతో వివాదం సద్దు మణిగింది. సీతంపాలెం పోలింగ్ బూత్‌లో బందోబస్తు కోసం వచ్చిన పోలీస్ ఉద్యోగి క్యూలో ఉన్న ఓటర్లకు సైకిల్‌కు వేయాలని ప్రచారం చేయడాన్ని అక్కడ వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉపమాకలో పోలింగ్ బూత్ వద్ద కూడా టీడీపీ వైఎస్సార్‌సీపీ శ్రేణుల నడుమ తోపులాట జరిగింది. ఇరుపార్టీలకు చెందిన ముఖ్యనాయకులు ఇరు వర్గాలను చెదర గొట్టారు. సమయం ముగిసిన తర్వాత కూడా క్యూలో ఉన్నవారందనికి ఓటు వేసే అవకాశం కల్పించారు. స్థానికంగా ఉన్నవారే కాకుండా వ్యాపార, ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు ఈ ఎన్నికల్లో తమ స్వగ్రామాలకు వచ్చి తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులు, రాష్ట్ర కాపు కార్పొషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనితలు వివిధ గ్రామాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించారు. ఆయాపార్టీలకు చెందిన నాయకులు వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఆటోలు ఏర్పాటు చేసి ఓటుహక్కు వినియోగించుకునేందుకు సహకరించారు. ఎటువంటిఅవాంఛనీయ సంఘటనలను జరగకుండా సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నక్కపల్లి, దేవవరం, ఉద్దండపురం, చినదొడ్డిగల్లు, ఉపమాక, వేంపాడు, రాజయ్యపేట,డిఎల్‌పురం, వెదుళ్లపాలెం, కాగిత, గొడిచర్ల గ్రామాల్లో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. క్యూలో ఉన్న వారందరికీ ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకున్నారు. జనరేటర్లు, విద్యుత్ సదుపాయం కల్పించి పోలింగ్ కొనసాగించారు.పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్లు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ర్యాంపులు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేశారు.

పాయకరావుపేట : మండలంలో గల 24 గ్రామాల్లోను 90 పోలింగ్ బూత్‌ల్లోను ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకే ప్రారంభించవలసిన పోలింగ్ కొన్నిచోట్ల అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. పాల్తేరు గ్రామంలో 40 నిముషాల పాటు ఈవీఎం మొరాయించడంతో ఓటర్లు క్యూలో వేచి ఉన్నారు. వృద్ధులను సైతం కుటుంబ సభ్యులు పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకొని వచ్చి ఓటు వేయించారు. ఉదయం 6 గంటలకే కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూలు కట్టారు. ఎండ విపరీతంగా వున్నప్పటికీ ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ముఖ్యంగా మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు పాయకరావుపేట, మంగవరం, సత్యవరం తదితర గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించి, పోలింగ్ సరళి పై ఆరా తీశారు. సీఐ పి.అప్పలరాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం వల్ల ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.

ఎస్.రాయవరం : మండలంలో సార్వత్రిక ఎన్ని పోలింగ్ ఉదయం ఏడు గంటల నుంచి సోమవారం ప్రారంభమైంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయత్రం 6 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ ముగిసేసరికి 75 శాతం పోలింగ్ నమోదు అయినట్టు ఏఆర్వో విజయలక్ష్మి తెలిపారు. ఎండతీవ్రతను దృష్టిలో ఉంచుకుని కొందరు పోలింగ్ ప్రారంభానికి ముందే పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరారు. 7 గంటలకు పోలింగ్ ప్రారంభించారు. తిమ్మాపురం 244, పి.ధర్మవరం బూత్‌లలో ప్రారంభంలో ఈవీఎంలు మొరాయించడంతో గంటన్నర పాటు పోలింగ్ ఆలస్యంగా జరిగింది. తిమ్మాపురం గ్రామంలో అడిషనల్ ఎస్పీ బి.విజయ్‌భాస్కర్ పోలింగ్ సరళిని పరిశీలించారు. దాదాపు అన్ని పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోందని చెప్పారు.

తిమ్మాపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న కంబాల జోగులు

పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు తిమ్మాపురం 246 పోలింగ్ బూత్‌లో సోమవారం ఉదయం 8.41 గంటలకు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సర్పంచ్ కర్రి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బొండా దివాణం, శ్రీనివాసరావు, మందగుదుల వెంకటరమణ, గుర్రం నానాజీ ఆయన వెంట ఉన్నారు.

కోటవురట్ల: మండలంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. అక్కడక్కడా స్వల్ప ఘర్షణలు మినహా ఎక్కడా అల్లర్లు జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. మండలంలోని 54 పోలింగ్ కేంద్రాలలో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా ఆరంభంలో కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. జల్లూరులో సుమారు గంట పాటు ఈవీఎం పనిచేయకపోవడంతో ఓటర్లు భారీ స్థాయిలో నిలిచిపోయారు. కైలాసపట్నంలో పోలింగ్ కేంద్రం చిన్నది కావడంతో ఓటర్లు బారులు తీరారు. పోలింగ్ సమయం 6 గంటలకే ముగిసినా అప్పటికి క్యూలో ఉన్న వారికి ఓటు వేసుకునే అవకాశం కల్పించారు. రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగింది. కైలాసపట్నంలో ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి. సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, తంగేడులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్ సీతారామరాజు ఓటు హక్కును వినియోగించుకున్నారు. దివ్యాంగులను కేంద్రాలకు తరలించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక ఆటోలు ఏర్పాటు చేసింది. దివ్యాంగులు, లేవలేని వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు మోసుకొచ్చి ఓటు వేయించారు. కై లాసపట్నం పోలింగు కేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు సందర్శించి పోలింగు సరళిని తెలుసుకున్నారు. పాములవాకలో ఓటర్లు ఆదర్శంగా నిలిచారు. ఇక్కడ అత్యధికంగా 86.5 శాతం పోలింగ్ నమోదైంది. కె.వెంకటాపురం, అన్నవరంలో రెండు పార్టీల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు, ప్రత్యేక ఫోర్స్ ఇరువర్గాలను చెదరగొట్టి పోలింగ్‌కు ఆటంకం లేకుండా చేశారు. జల్లూరులోని బూత్ నంబరు 10లో ఎన్నికల సిబ్బంది ఓటర్లకు టీడీపీకి అనుకూలంగా వేయాలని సూచిస్తున్నారని, పోలింగ్ కేంద్రం వద్ద తిష్టవేసిన టీడీపీ సర్పంచ్ పద్మావతి ఓటర్లకు సైగలు చేసి ప్రభావితం చేశారని వైఎస్సార్‌సీపీ నాయకులు, యువకులు వాగ్వాదానికి దిగి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఒకానొక సమయంలో పోలింగు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీకే ఓటర్ల ఆదరణ

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం : ప్రజల ఆశీస్సులతో మరోసారి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేస్తామని. మంచి మెజార్టీతో విజయం సాధిస్తానని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. ఓటేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరు సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని కోరుటుంటున్నారు. ఐదేళ్ల కాలంలో అర్హులైన రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. మహిళలు అందరూ వైఎస్సార్‌సీపీ విజయాన్ని కాంక్షిస్తున్నారన్నారు. 30 వేల ఓట్ల మెజార్టీ సాధిస్తామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు.

పోలింగ్ తీరు

ఎన్నికల పోలింగ్ సరళి (రాత్రి 10 గంటల వరకూ)

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	ఓటింగ్ శాతం
నర్సీపట్నం	212046	137691	64.93
పాయకరావుపేట	250744	168072	67.03




ఓటు హక్కు వినియోగించుకున్న వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ ఉమాదేవి, ఎంఎస్ఎంఈ చైర్మన్ సూర్యనారాయణరాజు


చెట్టుపల్లిలో తల్లిని ఓటేసేందుకు తీసుకువస్తున్న కుమార్తెలు


నక్కపల్లిలో వృద్ధుడిని వీల్‌చైర్‌పై పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకెళ్తున్న దృశ్యం


గొలుగొండ : గుండిపాలలో 80 ఏళ్ల వృద్ధురాలిని ఓటు వేయించడానికి తీసుకు వస్తున్న దృశ్యం


మంగవరంలో ఓటు వేయడానికి వస్తున్న వృద్ధుడు


తామరంలో వృద్ధుడిని వీల్‌చైర్‌లో కేంద్రంలోనికి తీసుకెకుతున్న సహాయకులు


కైలాసపట్నంలో దివ్యాంగురాలికి సహాయపడుతున్న ఎన్నికల సిబ్బంది


కైలాసపట్నంలో వృద్ధురాలిని మోసుకొస్తున్న దృశ్యం


పి.ధర్మవరంలో సాయంత్రం అయినా బారులు తీరిన ఓటర్లు


గొలుగొండ : చీడిగుమ్మలలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన ఓటర్లు

ఓటు ప్రతి ఒక్కరి బాధ్యత : వర్ధమాన నటుడు రాఖీ

కోటవురట్ల : ఓటు ఓ అద్భుతమైన ఆయుధమని, అందరూ బాధ్యతగా ఓటు వేయాలని వర్ధమాన యువ నటుడు అల్లు రామకృష్ణ ఉరఫ్ రాఖీ అన్నారు. స్వగ్రామమైన అక్కాహేబుపేటలో రాఖీ సోమవారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెద్ద హీరోల సినిమాల్లో పలు పాత్రలు పోషించిన రాఖీ ఇపుడిపుడే చిన్న సినిమాలలో ప్రధాన పాత్రలు పోషించే స్థాయికి ఎదుగుతున్నారు. బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్న తపనతోనే తన స్వగ్రామం వచ్చినట్టు రాఖీ తెలిపారు. తనకు ప్రముఖ డైరక్టర్ పూరీ జగన్నాధ్ అంటే ఎంతో ఇష్టమని, అలాగే నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ అన్నా ఎంతో అభిమానమని తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం తన మిత్రులను కలుసుకుని సరదాగా గడిపారు.


అక్కాహేబుపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న నటుడు రాఖీ